# సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత


నర్సాపూర్‌లో సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్/ కొల్చారం, జూన్ 12: నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు మండలాలకు చెందిన బాధిత కుటుంబాలకు గురువారం ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి నర్సాపూర్‌లోని క్యాంప్ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. వరిగుంతం గ్రామానికి చెందిన సాలె దేర్గారాం కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మాజీ జడ్పీటీసీ మేఘమాల సంతోష్ కుమార్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి రూ. లక్షా యాభైవేల ఎల్ఓసీ ఇప్పించారు.

**ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే**

నర్సాపూర్ మండలంలోని తుజాల్‌పూర్‌లో నల్లపోచమ్మ, ముత్యాలమ్మ ఉత్సవాల్లో గురువారం ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పాల్గొని చేశారు. నిర్వాహకులు ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సత్కరించారు.

**మాజీ కోఆప్షన్ సభ్యుడిని పరామర్శించిన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి**

శివ్వంపేట్ మండలం దొంతి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మండల కో-ఆప్షన్ సభ్యుడు లాయక్ మంగళవారం గుండెపోటుకు హైదరాబాద్‌లో శస్త్ర చికిత్స చేయించుకున్నారు. గురువారం ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి లాయక్‌ను పరామర్శించి వారికి మనోధైర్యాన్ని చెప్పారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ యువ నాయకులు సంతోష్‌రెడ్డి ఉన్నారు.

# కార్యకర్తలకు అండగా ఉంటా: ఎమ్మెల్యే


భిక్షపతికి కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్, జూన్ 12: బీఆర్ఎస్ కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటానని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి భరోసా ఇచ్చారు. బీఆర్ఎస్ నర్సాపూర్ పట్టణ అధ్యక్షుడు పంబల భిక్షపతి పుట్టినరోజు వేడుకలు గురువారం నర్సాపూర్ క్యాంప్ కార్యాలయంలో బీఆర్ఎస్ శ్రేణుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి హాజరై భిక్షపతితో కేక్ కట్ చేయించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సత్యంగౌడ్, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, బీఆర్ఎస్ నాయకులు షేక్ హుస్సేన్, సూరారం నర్సింహులు, జగదీశ్, ఆనంద్‌కుమార్, రాకేశ్‌గౌడ్, ఆంజనేయులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అందుబాటులో వరి విత్తనాలు


రుస్తుంపేట్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

నర్సాపూర్, జూన్ 12: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏవో దీపిక వెల్లడించారు. కేఎన్ఎమ్-1638 10 కిలోల బస్తా ధర రూ.455, కేఎన్ఎమ్-1638 25 కిలోల బస్తా ధర రూ.1075, ఆర్ఎన్ఆర్ 15048 25కిలోల బస్తా ధర రూ.1165 ఉందని తెలిపారు. అవసరమైన రైతులు తమ ఆధార్‌కార్డు. పట్టాదారు పాస్‌బుక్‌తో వచ్చి విత్తనాన్ని కొనుగోలు చేయగలరని కోరారు. రుస్తుంపేట్, ఆద్మాపూర్‌లలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు-అన్నదాతలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యవేక్షకులుగా తెలంగాణ సెంట్రల్ జోన్ రైతుల ప్రతినిధి యాదగిరి హాజరయ్యారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా.పద్మశ్రీ, డా.గీత, డా.రంజిత, డా.గాయత్రి, ఏఈవోలు చంద్రవేణి, తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలి


బడిబాట ర్యాలీలో పాల్గొన్న సీడీపీవో స్వరూపారాణి, సిబ్బంది

రామాయంపేట, జూన్ 12: మూడేండ్ల వయస్సు పైబడిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని రామాయంపేట ఐసీడీఎస్ సీడీపీవో స్వరూపారాణి కోరారు. గురువారం మండలంలోని ఝాన్సిలింగాపూర్ లో నిర్వహించిన బడిబాటలో ఆమె పాల్గొన్నారు. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భారతి, కార్యకర్తలు సునీత, నాగమణి, ఆశా వర్కర్లు పుష్పలత, రాధిక, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి


రైతు భరోసా దరఖాస్తులను తీసుకుంటున్న రాజ్‌నారాయణ

రామాయంపేట, జూన్ 12: అర్హులైన రైతులు రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలని రామాయంపేట వ్యవసాయ శాఖ ఇన్‌చార్జి డివిజన్ సహాయ సంచాలకులు రాజ్‌నారాయణ పేర్కొన్నారు. గురువారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. డివిజన్ వ్యాప్తంగా 910 కొత్త పాసు పుస్తకాలను ప్రభుత్వ జారీ చేసిందని, రైతులు రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 20 వరకు రైతులు తమ పట్టాపాసు పుస్తకం, ఆధార్ జిరాక్సులను అందజేయాలన్నారు.

**రేగోడ్ మండలంలో...**

రేగోడ్, జూన్ 12: రైతు భరోసా కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏవో జావీద్ సూచించారు. ఈనెల 5 వరకు కొత్తగా పాస్‌బుక్‌లు పొందిన రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పట్టాపాస్‌బుక్, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ పత్రాలతో పాటు రైతుభరోసా దరఖాస్తు ఫారం ఈనెల 20 వరకు సమర్పించాలని కోరారు.

# ఎంపీడీవోకు ట్రాక్టర్ తాళాలు అప్పగింత


ఎంపీడీవోకు తాళాలు అప్పగిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

చేగుంట, జూన్ 12: చెత్త సేకరణ ట్రాక్టర్ నిర్వహణ తమతో కావడం లేదని, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తూ జీపీల ట్రాక్టర్ తాళాలను మండలంలోని పంచాయతీ కార్యదర్శులు గురువారం ఎంపీడీవో చిన్నారెడ్డికి అప్పగించారు. బీఆర్ఎస్ హయాంలో అప్పటి సీఎం కేసీఆర్ గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రత, ఇంటింటా తడిపొడి చెత్త సేకరణ కోసం ప్రతి జీపీకి ట్రాక్టర్ సమకూర్చారు. ట్రాక్టర్ ద్వారా పంచాయతీ కార్మికులు తడి, పొడి చెత్తను సేకరించేవారు. హరితహారంలో నాటిన మొక్కలకు జీపీ ట్రాక్టర్ ట్యాంకర్ ద్వారా నీరు పోసేవారు. కొన్ని నెలలుగా జీపీలకు బిల్లులు రాకపోవడంతో అప్పులు తెచ్చి పంచాయతీ కార్మికులకు జీతాలు ఇచ్చామని, ప్రస్తుతం ట్రాక్టర్ డీజిల్‌కు డబ్బులు లేవని, వాటిని మోయలేమని ఎంపీడీవోకు ట్రాక్టర్ తాళాలు అప్పగించినట్లు పంచాయతీ కార్యదర్శులు తెలిపారు.

# ప్రతిఒక్కరూ అడవులను కాపాడుకోవాలి


గోడ పత్రిక ఆవిష్కరిస్తున్న గీత

రామాయంపేట, జూన్ 12: పర్యావరణ పరిరక్షణకు అడవులను అందరూ కాపాడాలని రామాయంపేట ఫారెస్టు రేంజ్ డిప్యూటీ ఆఫీసర్ గీత అన్నారు. గురువారం స్థానిక అటవీ శాఖ కార్యాలయంలో అటవీ సంరక్షణపై పోస్టర్‌ను ఆవిష్కరిం చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చట్టాలను ఉల్లంఘిస్తే చట్టప్రకారం కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ప్రజలకు అడవుల సంరక్షణపై అవగాహన పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చెట్లు నరకడం, మట్టి, ఇసుకను తీయడం, అటవీ భూములను చదును చేసి కబ్జా చేస్తే జరిగితే చట్టపరంగా కేసులు ఉంటాయన్నారు.


కౌడిపల్లి: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినీరెడ్డి


అల్లాదుర్గం: ముస్లాపూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న డీఈవో రాధాకిషన్



కొల్చారం: రంగంపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఏంఈవో సత్యనారాయణ

# ప్రభుత్వ బడుల్లోనే మెరుగైన విద్య

- డీఈవో రాధాకిషన్

పాపన్నపేట, జూన్ 12: అన్నిరకాల సౌకర్యాలతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం, సుశిక్షితులైన ఉపాధ్యాయులచే విద్యాబోధన జరుగుతున్న ప్రభుత్వ బడుల్లోనే తమ పిల్లల్ని చేర్పించాలని డీఈవో రాధాకిషన్ సూచించారు. గురువారం నాడాయన మండల పరిధిలోని గాజులగూడెం పాఠశాలలో నూతన విద్యా సంవత్సరాన్ని ప్రారంభించారు. నూతనంగా చేరిన విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ప్రైవేట్ పాఠశాలల కన్నా ప్రభుత్వ పాఠశాలలోనే మెరుగైన విద్య లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో ప్రతాపరెడ్డి, ప్రధానోపాధ్యాయులు సాయిసిరి, ఉపాధ్యాయులు రవీందర్ రెడ్డి, వేణుగోపాల్, సాయిలు పాల్గొన్నారు.


పాపన్నపేట మండలంలోని గాజులగూడెం పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న డీఈవో రాధాకిషన్. చిత్రంలో ఎంఈవో, ఉపాధ్యాయులు ఉన్నారు.


రామాయంపేట: శిశుమందిర్ పాఠశాలలో గాయత్రీ యజ్ఞం చేస్తున్న వేదబ్రాహ్మణులు


చిన్నశంకరంపేట: పట్టణంలో విద్యార్థులకు పుస్తకాలు, డ్రెస్సులు అందజేస్తున్న ఎంఈవో పుష్పవేణి


చిన్నశంకరంపేట: చందాపూర్‌లో విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు అందించి ఆహ్వానిస్తున్న ఉపాధ్యాయ బృందం


నర్సాపూర్: పట్టణంలో పాఠ్య పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎంఈవో తారాసింగ్, హెచ్ఎం అనురాధ, ఉపాధ్యాయులు


పెద్దశంకరంపేటలో విద్యార్థులకు యూనిఫామ్స్, పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈవో వెంకటేశం


వెల్దుర్తి: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం అందజేస్తున్న ఎంఈవో యాదగిరి, చిత్రంలో హెచ్ఎం సాంబయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.


చిలిపిచెడ్: సోమక్కపేటలో విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఎంఈవో విఠల్


మెదక్ అర్బన్: మెదక్‌లోని అర్బన్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న ఎంఈవో


నిజాంపేట: నిజాంపేట ప్రాథమిక పాఠశాలలో పూలతో స్వాగతం పలికిన అనంతరం విద్యార్థులతో ఉపాధ్యాయులు

## తొలిరోజు పంతుళ్ల డుమ్మా

**ఏడుగురు టీచర్లకు ముగ్గురే హాజరు**


ప్రార్థనకు హాజరైన ముగ్గురు టీచర్లు, నలుగురు విద్యార్థులు

రామాయంపేట, జూన్ 12: స్థానిక ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాలలో మొదటి రోజునే ఏడుగురు ఉపాధ్యాయుల్లో ముగ్గురు మాత్రమే విధులకు హాజరయ్యారు. ఈ విషయమై ఎంఈవోను వివరణ కోరగా విధులకు హాజరుకాని వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా, విద్యార్థు లు సైతం నలుగురే రావడం గమనార్హం..

**పాఠశాలను అందంగా తయారుచేసి**

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈవో శ్రీనివాస్ అన్నారు. గురువారం కోనాపూర్‌లో ప్రభుత్వ పాఠశాలను అందంగా తయారుచేసి విద్యార్థులను ఆహ్వానించారు. బడిబయట ఉన్న పిల్లలను బడిలో చేర్చే బాధ్యత టీచర్లదేనన్నారు.

## పూజారికి పరామర్శ


మధుసూదనాచార్యులును పరామర్శిస్తున్న దేవేందర్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 12: పట్టణంలోని కోదండ రామాలయ ప్రధాన పూజారి మధుసూధనాచార్యులు ఇటీవల మోకాలికి శస్త్రచికిత్స చేయించుకొని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. గురువారం ఆయనను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, ఇఫ్కో మాజీ డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. బీఆర్ఎస్ నేతలు లింగారెడ్డి, మధు, సాధిక్‌అలీ, రంజిత్ నాయక్, నరేందర్, లడ్డునాయక్ ఉన్నారు.

# ప్రభుత్వ పాఠశాలను పరిశీలించిన కలెక్టర్


విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

నర్సాపూర్, జూన్ 12: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ గురువారం సందర్శించి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలో 17 తరగతి గదులు ఉన్నాయని, ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా తరగతి గదులున్నాయని తెలిపారు. జూనియర్ కాలేజీ నిర్వహణకు రెండు గదులు అవసరం ఉన్న పక్షంలో పరిశీలించడం జరిగిందన్నారు. ప్రణాళికాబద్ధంగా తదుపరి చర్యలు చేపడతామని వెల్లడించారు. కలెక్టర్ వెంట జిల్లా ఇంటర్మీడియట్ అధికారి మాధవి, ఎంఈవో బుచ్చానాయక్, ప్రధానోపాధ్యాయులు బాలచంద్రం తదితరులు పాల్గొన్నారు.

# పంట మార్పిడితో అధిక లాభాలు


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

కొల్చారం, జూన్ 12: పంట మార్పిడితో రైతులకు లాభాలు చేకూరుతాయని కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ పరిశోధనా సంస్థ శాస్త్రవేత్తలు తెలిపారు. మండలంలోని సంగాయిపేటలో ఏవో శ్వేతకుమారి ఆధ్వర్యంలో గురువారం వికసిత్ సంకల్ప అభియాన్ కృషి ముగింపు కార్యక్రమం నిర్వహించారు. శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలన్నారు. పంట మార్పిడి ద్వారా నేలలో సేంద్రియ కర్బనాన్ని పెంపొందిస్తూ నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. డ్రోన్ వినియోగం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ షేక్ ఎన్ మీరా, డైరెక్టర్ అటారి జోన్-x, డాక్టర్ వికే సింగ్, డాక్టర్ మహేందర్ కుమార్, సురేశ్ కుమార్, కిషన్ కుమార్, యస్‌డి నల్కర్, ప్రతాప్‌రెడ్డి, రవికుమార్, వినయ్ విన్సెంట్, ఏవో శ్వేతా కుమారి, ఏఈవో రాజశేఖర్, కోరమాండల్ ప్రతినిధి శ్యామ్‌సుందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

# లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి పదేండ్ల జైలు

మెదక్ అర్బన్, జూన్ 12: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి పదేండ్ల జైలు శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ తీర్పునిచ్చారని ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు గురువారం ప్రకటనలో తెలిపారు. ఎస్పీ వివరాల ప్రకారం... రామాయంపేట పట్టణానికి చెందిన రొయ్యల రాజు 27 ఆగస్టు 2009లో 2వ తరగతి చదువుతున్న బాలికను ఖాళీ స్థలంలోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. రామాయంపేట సీఐ విజయ్‌కుమార్ కేసు నమోదు చేసి నేరస్తుడిని కోర్టులో హాజరుపరిచారు. ప్రస్తుత సీఐ వెంకటరాజాగౌడ్ సాక్ష్యులను కోర్టులో ప్రవేశ పెట్టగా, పూర్తి సాక్ష్యాధారాలను పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ నిందితుడికి శిక్ష ఖరారు చేశారు. నిందితుడికి శిక్ష పడేలా వాదనలు వినిపించిన జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ షేక్ ఫజల్ అహ్మద్, లైజనింగ్ అధికారి విఠల్, కానిస్టేబుల్ రవీందర్‌గౌడ్‌ను ఎస్పీ అభినందించారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న వైద్యాధికారి శ్రీరాం

రామాయంపేట, జూన్ 12: సీజనల్ వ్యాధుల పట్ల ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో శ్రీరాం సూచించారు. గురువారం రామాయంపేట మండలం డి.ధర్మారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యులు హరిప్రసాద్, డి.ధర్మారం వైద్యురాలు హరిప్రియ, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు ఉన్నారు.

# భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

చిన్నశంకరంపేట, జూన్ 12: భూభారతితోనే భూసమస్యలు పరిష్కారమవుతాయని మెదక్ ఆర్డీవో రమాదేవి తెలిపారు. గురువారం మండల పరిధిలోని గవ్వలపల్లిలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సును ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా రైతుల నుండి వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ మన్నన్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

**నిజాంపేట మండలంలో...**

నిజాంపేట, జూన్ 12: మండల వ్యాప్తంగా రెవెన్యూ సిబ్బంది నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులు గురువారం నాటితో ముగిశాయి. నిజాంపేటలోని రైతు వేదికకు రైతులు తరలివచ్చి భూసమస్యల పరిష్కారం కోరుతూ దరఖాస్తులను అందజేశారని తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రమ్యశ్రీ, ఆర్ఐలు ప్రీతి, ఇమాద్, సీనియర్ అసిస్టెంట్ రమేశ్, పంచాయతీ కార్యదర్శి నర్సింహులు, రైతులు వెంకటేశం, వెంకటేశ్‌గౌడ్, నారాయణ, కిష్టారెడ్డి ఉన్నారు.


చిన్నశంకరంపేటలో దరఖాస్తులను పరిశీలిస్తున్న ఆర్డీవో రమాదేవి


నిజాంపేట: రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

**వెల్దుర్తిలో భూభారతి రెవెన్యూ సదస్సు**

వెల్దుర్తి, జూన్ 12. మండల కేంద్రమైన వెల్దుర్తిలోని రైతు వేదికలో తహసిల్దార్ బాలలక్ష్మి, డిప్యూటీ తహసిల్దార్ రాజేశ్వరీల ఆధ్వర్యంలో భూభారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన రైతులు భారీగా తరలి వచ్చి భూ సమస్యలపై అధికారులకు దరఖాస్తులు చేసుకున్నారు. మాసాయిపేట మండలంలోని హక్కింపేటలో తహసిల్దార్ జ్ఞానజ్యోతి ఆధ్వర్యంలో రైతు సదస్సు నిర్వహించి రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.

**భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు**

చేగుంట, జూన్ 12: భూసమస్యల పరిష్కారమే లక్ష్యంగా భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీకాంత్ అన్నారు. మండలంలోని బి.కొండాపూర్, పొలంపల్లిలో నిర్వహించిన సదస్సులు నిర్వహించారు. రైతుల నుంచి దరఖాస్తులు తహసీల్దార్ స్వీకరించి కొన్ని అక్కడికక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ స్వప్న, ఆర్ఐలు జైభారత్‌రెడ్డి, సంతోష్ రావు, సర్వేయర్ రవీందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

రామాయంపేట, జూన్ 12: రామాయంపేటలోని కోమటిపల్లి కస్తూర్బాగాంధీ పాఠశాలలో అధ్యాపకుల పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ అనురాధ గురువారం సూచించారు. 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరం సిలబస్ అప్‌డేట్ చేయబడిందని తెలిపారు. ఇంగ్లిష్ 1, తెలుగు 1, ఫిజిక్స్ 1, కెమిస్ట్రీ 1, బోటనీ 1, జువాలజీ 1 పోస్టులు ఖాళీలు ఉన్నాయని తెలిపారు. అభ్యర్థులు బీఈడీ, పీజీ పూర్తిచేసి ఉండాలన్నారు. గెస్టు ఫ్యాకల్టీగా ఈనెల 14వరకు తమ దరఖాస్తులను కేజీబీవీలో నేరుగా అందజేయాలన్నారు. బైపీసీలో జాయిన్ కావడానికి ఖాళీలు ఉన్నాయని, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

**కుకింగ్ పోస్టులకు...**

స్థానిక తెలంగాణ మోడల్ స్కూల్‌లో వంట మనుషుల పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని టీఎస్ మోడల్ పాఠశాల ప్రత్యేక అధికారి విజయలక్ష్మి తెలిపారు. వంట చేయడం కోసం అనుభవజ్ఞులైన మహిళలు హెడ్‌కుక్, అసిస్టెంటు కుక్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, తమ దరఖాస్తులను ఈనెల 14వ వరకు నేరుగా మోడల్ స్కూల్‌లో అందజేయాలన్నారు. వంటలు చేసేవారు కనీస విద్యార్హత పదవ తరగతి ఉత్తీర్ణులై, అనుభవజ్ఞులై ఉండాలన్నారు.

**చిట్కుల్ కేజీబీవీలో..**

చిలిపిచెడ్, జూన్ 12: మండలంలోని చిట్కుల్ కేజీబీవీ పాఠశాలలో పీజీసీఈ ఆర్టీలుగా ఇంటర్ ప్రథమ సంవత్సరంలో బైపీసీ గ్రూపును ప్రవేశపెట్టినట్లు ఆ పాఠశాల ప్రత్యేకాధికారి అంజలి తెలిపారు. పాఠశాలలో బైపీసీ విద్యార్థులకు బోధించేందుకు గుర్తింపు పొందిన యూనివర్సిటీలో పీజీలో 50శాతం మార్కులు, బీఈడీ అర్హత సాధించిన మహిళా అభ్యర్థులు ఈనెల 15 తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు తెలుగు, ఆంగ్లం, వృక్ష శాస్త్రం, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో బోధించేందుకు అర్హత కలిగినవారు విద్యార్హత పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

**రేగోడ్ కేజీబీవీ పాఠశాలలో..**

రేగోడ్, జూన్ 12: కస్తూర్బాగాంధీ జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపకులుగా పనిచేయుటకు అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని స్పెషలాఫీసర్ స్వయంప్రభ తెలిపారు. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, తెలుగు, ఇంగ్లిష్ ప్రతి సబ్జెక్టుకు ఒక్క పోస్ట్ చొప్పున ఖాళీలు ఉన్నాయని తెలిపారు. విద్యార్హత విద్యార్హత పీజీ, బీఈడీ అర్హత ఉండాలన్నారు. అలాగే హెడ్‌కుక్, అసిస్టెంట్ కుక్ పోస్టులు ఖాళీలు ఉన్నాయని, పదవ తరగతి పాసై, వంటచేయుటకు అనుభవం కలిగిన మహిళా అభ్యర్థులు ఈనెల 18వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## అనుమతి లేని పాఠశాలకు నోటీస్

రేగోడ్, జూన్ 12 : అనుమతి లేని పాఠశాలకు స్థానిక ఎంఈవో గురునాథ్ షోకాజ్ నోటీస్ అందజేశారు. మండలంలోని లింగంపల్లిలో డాన్‌బాస్కో పాఠశాలను అనుమతులు లేకుండా నడిపిస్తున్నారని అందిన గ్రామస్తుల ఫిర్యాదుతో గురువారం ఎంఈవో, గజ్వాడ కాంప్లెక్స్ హెచ్ఎం ప్రేమ్‌సాగర్ రావు పాఠశాలను సందర్శించారు. మూడు రోజుల్లోగా సంబంధిత పత్రాలు అందజేయాలని సూచించారు. లేనిపక్షంలో పాఠశాలను మూసివేసి సీల్ వేస్తామని తెలిపారు. అనుమతిలేని పాఠశాలలపై చర్యలు తప్పవని ఎంఈవో హెచ్చరించారు.

## గుర్తుతెలియని వ్యక్తి శవం లభ్యం

నర్సాపూర్, జూన్ 12: గుర్తుతెలియని ఓ వ్యక్తి శవం నర్సాపూర్ పట్టణంలో లభ్యమైంది. ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సంగారెడ్డి మార్గంలో గల ఆనంద్ గార్డెన్ సమీపంలో ఓ మగ వ్యక్తి శవం ఉందని బుధవారం సమాచారం అందగా, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతిచెందిన వ్యక్తి ఇతర రాష్ట్రానికి చెందినవాడుగా పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులుగా అదే ప్రాంతంలో ఆ వ్యక్తి సంచరించినట్లు స్థానికులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లింగం వెల్లడించారు.

## కరెంట్ షాక్‌తో పాడిబర్రె మృతి

రామాయంపేట, జూన్ 12: మండలంలోని లక్ష్మాపూర్‌లో విద్యుదాఘాతంతో పాడిబర్రె మృతిచెందింది. గ్రామానికి చెందిన రాగుల సిద్ధిరాములు తన బర్రెను తన ఇంటివద్ద గడ్డి మేపుతుండగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి అక్కడ ఉన్న వైర్‌కు తగిలింది. దీంతో విద్యుత్ షాక్‌కు గురై బర్రె అక్కడికక్కడే మృతిచెందింది. విద్యుత్ శాఖ తనకు నష్టపరిహారం అందించాలని బాధిత రైతు కోరాడు.

## నిందితుడి అరెస్టు

వెల్దుర్తి, జూన్ 12: దొంగతనానికి పాల్పడిన యువకుడిని పట్టుకొని కొంత డబ్బును స్వాధీనం చేసుకొని, రిమాండ్‌కు తరలించినట్లు స్థానిక ఎస్సై రాజు గురువారం తెలిపారు. మండలంలోని ఆరెగూడెంకు చెందిన హనుమాద్రి లక్ష్మాగౌడ్ ఇంట్లో ఈనెల 5న దుండగులు రూ. 90వేల నగదు ఎత్తుకెళ్లగా, బాధితులు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి గ్రామానికి చెందిన అనుమానితుడు కుస్తీ కార్తీక్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా, తానే దొంగతనం చేశానని ఒప్పుకున్నాడన్నారు. దొంగిలించిన రూ. 90వేలలో కార్తీక్ వద్ద అతను ఖర్చు చేయగా మిగిలిన రూ. 23 వేల నగదు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రాజు తెలిపారు.